నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శనివారం 15 జూన్ 2024 | SURYAPET

రామానంద తీర్థలో ఉచిత శిక్షణ

భూదాన్ పోచంపల్లి ,జూన్ 14 : మండల పరిధి జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉపాధి సాంకేతిక శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో 6 నెలల కాల పరిమితితో కూడిన ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ సర్వీస్ (ఐటీఐ/డిప్లొమో పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీటీవీ టెక్నీషియన్ (పదో తరగతి పాస్) టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్డ్ బ్యాగ్స్ మేకింగ్ (8వ తరగతి పాస్) కోర్సులు ఉంటాయని పేర్కొన్నారు.

అర్హత గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆదాయం సర్టిఫికెట్, ఆధార్, జీరాక్స్ సెట్‌తో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు రామానంద గ్రామీణ సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఉచిత శిక్షణ, హాస్టల్‌లో భోజన వసతితో పాటు ఉద్యోగం కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

చేప పిల్లల పంపిణీ లేనట్టేనా?

- గతంలో ఏటా రూ.4 కోట్లతో 3.80 కోట్ల సీడ్ పంపిణీ
- వర్షాకాలం ప్రారంభమైనా ప్రభుత్వ నుంచి నిర్ణయమే లేదు
- ఆందోళనలో 13,930 మంది మత్స్యకారులు

ఇప్పటికే టెండర్లు పూర్తి కావాల్సి ఉండగా ఆ ఊసే లేదు

సూర్యాపేట, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసింది. యేటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి వారికి ఉపాధికి దోహదపడింది. కానీ కాంగ్రెస్ సర్కారు చేప పిల్లల పంపిణీ ఊసే ఎత్తడం లేదు. వర్షాకాలం ప్రారంభమైనందున ఇప్పటికే ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం సీడ్ టెండర్లు పూర్తి కావాల్సి ఉండగా దానిపై నిర్ణయం తీసుకోలేదు. గతంలో సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఏటా సుమారు రూ.4 కోట్ల వ్యయంతో దాదాపు 950 చెరువుల్లో రూ.3.80 కోట్ల చేప పిల్లల సీడ్ ఉచితంగా అందించారు. ఈ ఏడాది కార్యక్రమం ఉన్నట్టా.. లేనట్టా అని మత్స్యకారుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం వల్ల జిల్లాలో 141 మత్స్య సహకార సొసైటీల్లో 13,930 మత్స్యకారులకు లబ్ధి చేకూరనుండగా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

2016 నుంచి పథకం అమలు

వ్యవసాయం, దాని అనుబంధ వృత్తిదారుల్లో వెలుగులు నింపేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. వ్యవసాయానికి సాగునీరుతోపాటు 24గంటల విద్యుత్, పంట పెట్టుబడి సాయం అందించింది. ఇక వ్యవసాయ అనుబంధ వృత్తులు బలపడేలా గొర్రెల పంపిణీ, సబ్సిడీపై గేదెలు, ఆవుల అందజేత, ఉచితంగా చేపల పంపిణీ చేసింది. మిషన్ కాకతీయతో చెరువులు పటిష్టం కావడంతో జలకళ సంతరించుకొని చేపల పెంపకానికి ఎంతో తోడ్పడ్డాయి. 2016లో కేసీఆర్ సర్కారు ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రారంభించగా గతేడాది వరకు నిర్విరామంగా కొనసాగింది. ఎనిమిది విడుతలుగా చేప పిల్లలను చెరువుల్లో వదిలారు. దాంతో ఎన్నో మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి లభించింది. ఈ ఏడాది మాత్రం దానిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉలుకుపలుకు లేకుండా ఉండడం మత్స్యకారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు

జూన్ నెల సగం పూర్తవుతున్నప్పటికీ ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపల సీడ్ కోసం టెండర్లు పిలువకపోవడంతో అనుమానాలకు తావిస్తున్నది. అసలు సీడ్ పంపిణీ ఉంటుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది వరకు వానకాలం సీజన్ ప్రారంభం కాకముందే చేప పిల్లల పంపిణీ కోసం ఏర్పాట్లు జరిగేవి. జూన్ ప్రారంభంలోనే టెండర్లను ఆహ్వానించి ఫైనల్ చేసేవారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పండుగ వాతావరణంలో చెరువుల్లోకి సీడ్‌ను వదిలేవారు. కానీ ఈ సారి మాత్రం దానికి సంబంధించిన చర్యలు ప్రారంభించలేదు. వర్షాలు కూడా కురుస్తున్నాయి. సెప్టెంబర్ వరకు సీడ్ వేస్తేనే మంచి ఎదుగుదల వస్తుంది. ఆలస్యమైతే చేపల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. కానీ ఈ కార్యక్రమంపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని జిల్లా మత్స్యశాఖ అధికారి రూపేందర్‌సింగ్ తెలిపారు.

ఉచిత చేప పిల్లలను వెంటనే అందించాలి

ప్రతి సంవత్సరం ప్రభుత్వం మత్స్యకారులకు అందించే ఉచిత చేప పిల్లలను వెంటనే అందించాలి. గతంలో జూన్ నాటికి చేప పిల్లల పంపిణీపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసే వారు. కాంగ్రెస్ సర్కారులో ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఈ సంవత్సరం ఉచిత చేప పిల్లలు ఇవ్వకుంటే రానున్న రోజుల్లో ఉపాధి కోల్పోయో పరిస్థితి ఏర్పడుతుంది.

–కోల కరుణాకర్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, కందగట్ల

మత్స్యకారులను గుర్తించని కాంగ్రెస్ ప్రభుత్వం

గతంలో ఉన్న ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు చేపట్టింది. ఉచితంగా చేప పిల్లలు, సబ్సిడీపై వాహనాలు, వలలు అందించడంతో ఎంతో మందికి లబ్ధి చేకూరింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 6 నెలలు దాటినా ఇప్పటివరకు మత్స్యకారుల గురించి ఆలోచించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉచిత చేప పిల్లలను వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

–జిట్టిబోయిన జానకి రాములు, మత్స్య సహకార సంఘం సభ్యుడు, గరిడేపల్లి

బ్రాహ్మణ వెల్లెంల పాఠశాలలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్యే వీరేశం, కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, డీఈఓ భిక్షపతి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- బడిబాట కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జూన్ 14 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని రాష్ట్ర ఆర్ అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లెంల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలందరికీ విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతు ఇంట్లో పుట్టిన తాను ఏడో తరగతి వరకు ఈ పాఠశాలలోనే విద్యను అభ్యసించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలకు ఎదుగవచ్చునని చెప్పారు. వచ్చే మూడు నాలుగు నెలల్లో బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టును పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభిస్తామని తెలిపారు.

నార్కట్‌పల్లి డిపోను పునరుద్ధరించడం కోసం 20 బస్సులు తెప్పిస్తామన్నారు. త్వరలో ప్రభుత్వం 13వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టును సందర్శించారు. రూ. 40 వేల కోట్లతో మూసీ ప్రక్షాళనకు కంకణం కట్టుకున్నామని, ఆరు నెలల్లో మూసీ సివరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేసి రానున్న మూడున్నర సంవత్సరాల్లో మూసీని స్వచ్ఛమైన నదిగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దాసరి హరిచందన, ఎస్పీ చందనా దీప్తి, జిల్లా విద్యాధికారి భిక్షపతి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సూర్యాపేటను డ్రగ్స్ రహిత జిల్లా చేద్దాం

- యువత, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

మాదకద్రవ్యాల నియంత్రణపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట, జూన్ 14 : మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలని, వచ్చే 30 రోజుల్లో సూర్యాపేటను డ్రగ్స్ రహిత జిల్లాగా చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల అలవాట్లను నడవడిని పరిశీలించాలని చెప్పారు. తల్లిదండ్రులు సైతం పిల్లల ప్రవర్తన, అలవాట్లను గమనిస్తు ఉండాలని తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లో తెలంగాణ సాంస్కృతిక సారథులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు బృందాలుగా ఏర్పడి వాటి వినియోగం వల్ల కలిగే నష్టాలను తల్లిదండ్రులకు తెలుపాలని చెప్పారు. మొదటి 15 రోజులు మండల స్థాయిలో, మిగతా 15 రోజులు మున్సిపాల్టీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ చెక్ పోస్టుల వద్ద వాహనాలను చెక్ చేయాలని, డ్రగ్స్, గంజాయి వంటి పదార్థాలు రవాణా కాకుండా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. అక్రమంగా పశువుల రవాణా నియంత్రణ కోసం చెక్ పోస్టుల వద్ద పశు సంవర్ధక శాఖ అధికారులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఎంహెచ్‌ఓ కోటాచలం, అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ పోతే వచ్చేదెప్పుడో?

- ఓవర్ లోడ్, చిన్న గాలివానకే ట్రిప్
- నల్లగొండ, తిప్పర్తి మండలాల్లోని ఐదు గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు
- కొత్తలైన్ వేసి ఎనిమిది నెలలైనా ప్రారంభించని అధికారులు

నల్లగొండ మండలం ఖాజీరామారంలో కరెంట్ పోవడంతో చీకటిమయం అయిన వీధి

నల్లగొండ, జూన్ 14 : తిప్పర్తి మండలంలోని కొరివేని గూడెం, తానేదార్‌పల్లి, నల్లగొండ మున్సిపాలిటీలోని శేషమ్మ గూడెం, ఎస్టీ కాలనీ, నల్లగొండ మండలంలోని ఖాజీరామారం గ్రామాల్లో విద్యుత్ కోతలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిప్పర్తి మండల విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ గ్రామాల్లో ఎనిమిది నెలలుగా కరెంటు కష్టాలు చుక్కలు చూపిస్తున్నాయి. కొత్త లైన్ వేసి ఎనిమిది నెలలు అవుతున్నప్పటికీ ప్రారంభించకపోవటం వల్ల ఈ సమస్య నెలకొంటున్నదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవటం లేదనే విమర్శలు వస్తున్నాయి. తిప్పర్తి మండలంలోని పజ్జూర్ సబ్‌స్టేషన్ ద్వారా సింగిల్ ఫీడర్‌తో కొరివేని గూడెం, తానేదార్ పల్లి, శేషమ్మ గూడెం, ఎస్టీ కాలనీ, ఖాజీ రామారంతోపాటు పానగల్ వ్యవసాయ బావులకు కరెంట్ సరఫరా అవుతున్నది. గృహ వినియోగ, వ్యవసాయ కనెక్షన్ల పెరుగుదల వల్ల చిన్న చిన్న సమస్యలకే కరెంట్ ట్రిప్ అవుతుండటంతో ఏడాది కింద పజ్జూర్ నుంచి కొత్త లైన్ తానేదార్‌పల్లి వరకు వేశారు. ఆ లైన్ వేసి ఎనిమిది నెలలైనా ప్రారంభించలేదు. దాంతో ఓవర్‌లోడ్ వల్ల చిన్న సమస్యలకే కరెంట్ ట్రిప్ అతున్నది. ఇటీవల కురుస్తున్న వర్షాలు, గాలి దుమారం కారణంగా క్షణక్షణం కరెంట్ ట్రిప్ అవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కరెంట్ పోగానే వేయాలంటే లైన్‌మెన్లు సకాలంలో అందుబాటులో లేనందున గంటల తరబడి కూడా కరెంట్ వచ్చే పరిస్థితి లేదు. ఇక రాత్రి పూట ట్రిప్ అయితే తెల్లారే వరకు కరెంట్ గురించి పట్టించుకునే వారే లేరు. దాంతో గ్రామాల్లో తాగు నీరు, వాడకం నీటి సమస్య తీవ్రంగా ఏర్పడుతున్నది. ఎండాకాలం నుంచి ఇంకా బయట పడకముందే కరెంట్ కటింగ్ ఉండటంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు పనిచేయక జనం సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు చిన్న సమస్యలకే లైన్‌మెన్లు ఎల్‌సీలు ఇవ్వడం వల్ల కరెంట్ సరఫరాకు మరింత అంతరాయం ఏర్పడుతున్నది. ఈ విషయంపై తిప్పర్తి విద్యుత్ ఏఈని ఫోన్‌లో వివరణకు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

లైన్‌మన్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవట్లేదు

నాకు ఇద్దరు ఆడ పిల్లలు. వాళ్ల పెండ్లి చేసిన. నా భర్త చనిపోతే నేను ఒక్క దాన్నే ఉంటా. స్తంభం మీద లైన్ సమస్య వల్ల మా ఇంట్ల కరెంట్ వస్తలేదు. లైన్‌మెన్‌కు చెప్పి జర చూడమంటే అస్సలు వస్తలేదు. పైగా ఎవరితోనన్న చెక్ చేయించుకోమని అంటున్నాడు. కరెంట్ బంద్ చేయమంటే పైన ఎవరూ బంద్ చేయరని వేరేవాళ్లు వస్తలేరు. పది రోజుల నుంచి చీకట్లోనే పడుకుంటున్నాను.

– లక్ష్మమ్మ, ఖాజీరామారం, నల్లగొండ మండలం

అడిగిన దానికి సమాధానం చెప్పండి..

లేదంటే సెలవు పెట్టి వెళ్లిపోండి

- అధికారులపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫైర్

చౌటుప్పల్, జూన్ 14 : పలు అభివృద్ధి పనులను పరిశీలించడానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం చౌటుప్పల్ పట్టణానికి వచ్చారు. వివిధ శాఖల అధికారులతో సమీక్షించి డ్రైనేజీ, సీసీరోడ్డు పనులు, బిల్లుల రికార్డుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. ఇప్పటి వరకు రూ.12 కోట్ల అగ్రిమెంట్ వ్యాల్యూలో గ్రాస్ ఎంత బుక్ అయ్యింది, దానిపై క్లారిటీ ఇవ్వాలని మున్సిపల్ శాఖ ఇంజినీరింగ్ అధికారులపై ఫైర్ అయ్యారు. ఆయన మాట్లాడుతుండగా ఓ మహిళా ఉద్యోగి పేపర్‌పై ఏదో రాస్తుండటంతో కోపోద్రిక్తుడైన ఎమ్మెల్యే ఆమెపై పేపర్లు విసిరారు. 'నేను అడిగిన దానికి సమాధానం చెప్పరేం.. నాలెడ్జ్ ఉందా? ఉంటే పని చేయండి.. లేకపోతే లీవ్ పెట్టి వెళ్లిపోండి' అని మండిపడ్డారు. 'మీరు చెప్పింది వినటానికి నేను రాలేదు.. నేను అడిగిన దానికి సమాధానం చెప్పాలి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మహిళా అధికారిని అని కూడా చూడకుండా ఇలా ప్రవర్తించడం సమజసం కాదని ఎమ్మెల్యే తీరును పలువురు ఖండించారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలి

- ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి

నల్లగొండ, జూన్ 14 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో మొట్ట మొదటి పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి సూచించారు. శుక్రవారం ఎంజీయూలో నిర్వహించిన పరీక్షల సన్నాహక సమావేశంలో రిజిస్ట్రార్ పాల్గొని పలు సూచనలు చేశారు. విశ్వవిద్యాలయం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రవేశ పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పరీక్ష మొదటి విడుతగా శనివారం ఉదయం 10:30 నుంచి 11:30 వరకు అన్ని సబ్‌జెక్ట్‌ల అభ్యర్థులకు రిసర్చ్ మెథడాలజీ పరీక్ష, రెండో విడుతలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు బిజినెస్ మేనేజ్మెంట్, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ అభ్యర్థులకు, 2 నుంచి 3 గంటల వరకు కామర్స్, బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేటిక్స్ అభ్యర్థులకు, 3:30 నుంచి 4:30 గంటల వరకు గణితం అభ్యర్థులకు పరీక్ష నిర్వహించాలని సూచించారు. సీఈఓ డాక్టర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 399 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు పొందాలని సూచించారు. నిర్ణీత సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని పేర్కొన్నారు. సమావేశంలో ఓఎస్‌డీ అంజిరెడ్డి, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. అరుణ ప్రియ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రవి

విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

కబడ్డీలో నల్లగొండ జట్టు విజేత

- ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

బొడ్రాయిబజార్, జూన్ 14 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండ్రోజులుగా జరిగిన తెలంగాణ రాష్ట్ర ఇంటర్ సర్కిల్ విద్యుత్ ఉద్యోగుల క్రీడలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీలో మొదటి బహుమతి నల్లగొండ ఆపరేషన్ సర్కిల్, ద్వితీయ బహుమతి మహబూబ్‌నగర్ ఆపరేషన్ సర్కిల్, తృతీయ బహుమతి వరంగల్ సర్కిల్ గెలుచుకున్నాయి. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు అధికారులు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఎస్ఈ సీహెచ్ పాల్‌రాజ్, ఆపరేషన్ డీఈలు శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, డీఈ టెక్నికల్ దాలినాయుడు, నల్లగొండ జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాస్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 ప్రాంతీయ అధ్యక్షుడు నేతకాని వెంకన్న, టీఆర్‌వీకే మల్లికార్జున్, 327 దశరథ రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీ

- నలుగురు దొంగల అరెస్ట్

చౌటుప్పల్ రూరల్, జూన్ 14 : మండలంలోని ధర్మోజిగూడెం వద్ద శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు సెల్‌ఫోన్ల చోరీ దొంగలను చౌటుప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా తుర్కనాయుడువలసకు చెందిన గొర్ల శివ, అంబటి శ్రీను, హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌కు చెందిన మేకల క్రాంతి, ఒడిశాకు చెందిన అమ్మేరి గణేశ్ మారుతి స్విఫ్ట్ (ఏపీ28డీఎల్ 6899)కారులో తిరుగుతూ దారి వెంట రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల రెండో తారీఖున చౌటుప్పల్ బస్టాండ్ వద్ద రద్దీగా ఉన్న బస్సులో సెల్‌ఫోన్ చోరీ చేసి ఫోన్ పే ద్వారా డబ్బులు బదిలీ చేస్తుండటంతో పోలీసులు లోకేషన్ ఆధారంగా ధర్మోజిగూడెం వద్ద పట్టుబడ్డారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

కిట్ కట..

సర్కారు ఆస్పత్రుల్లో కేసీఆర్ కిట్లు బంద్

- మూడు నెలలుగా ఆగిపోయిన వైనం
- ప్రభుత్వం నుంచి సరఫరా కాని కిట్లు
- తల్లీబిడ్డలకు రూ. 15వేల విలువైన వస్తువులు
- జిల్లాలో 300మంది బాలింతలకు పెండింగ్
- ప్రైవేట్‌లో కొనుగోలు చేస్తున్న పరిస్థితి
- పేరుకుపోయిన రూ. 12.14 కోట్ల బకాయిలు

అమ్మకు ఆసరాగా, బిడ్డకు ఆప్యాయతతో ప్రోత్సాహకాలు అందించేందుకు తీసుకొచ్చిన ఎంసీహెచ్ కిట్ (కేసీఆర్ కిట్) నిలిచిపోయింది. సర్కారు దవాఖానల్లో ప్రసవాలు ప్రోత్సహించి తల్లీబిడ్డలు ఆరోగ్యంగా చూడడానికి చేయూతనిచ్చే పథకం ఆగింది. ప్రసవ సమయంలో ఆసరాగా నిలుస్తుందనుకున్న నగదు అందని ద్రాక్షలా మారింది. జిల్లాలో మూడు నెలలుగా పథకం సక్రమంగా అమలు కావడం లేదు. దాంతో కిట్లను బయట ప్రైవేట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– యాదాద్రి భువనగిరి, జూన్ 14 (నమస్తే తెలంగాణ)

ప్రభుత్వ దవాఖానలో ప్రసవం అయ్యి కేసీఆర్ కిట్ అందుకున్న మహిళ(ఫైల్)

బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 జూన్‌లో కేసీఆర్ కిట్ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రసవం తర్వాత తల్లీబిడ్డకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించడం, వారు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో బిడ్డలకు జన్మనిచ్చిన మహిళలు ఈ పథకానికి అర్హులు. ఇద్దరికి కంటే ఎక్కువ పిల్లలుంటే దీనికి అనర్హులుగా నిర్ణయించింది. కేసీఆర్ కిట్‌లో తల్లీబిడ్డలకు అవసరమయ్యే సుమారు రూ. 15వేల విలువైన వస్తువులు అందిస్తున్నారు. ఇందులో సబ్బులు, బేబీ ఆయిల్, బేబీ బెడ్, దోమల తెర, డ్రెస్సులు, చీరలు, హ్యాండ్ బ్యాగ్, టవల్, న్యాప్కిన్లు, పౌడర్, డైపర్స్, షాంపు, పిల్లల బొమ్మలు తదితర ఐటెమ్స్ ఉంటాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కిట్ అనే పేరును తొలగించి, ఎంసీహెచ్ (మదర్ అండ్ చైల్డ్ హెల్త్) కిట్‌గా నామకరణం చేసింది.

అందని నగదు సాయం..

రాష్ట్ర ప్రభుత్వం కిట్‌తోపాటు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నది. ఆడబిడ్డ పుడితే రూ. 13వేలు, మగబిడ్డ పుడితే రూ. 12వేల చొప్పున సాయం చేస్తున్నది. గర్భం దాల్చినప్పటి నుంచి తొమ్మిదో నెల వరకు నాలుగు దశల్లో ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. 5-6 నెలల మధ్య పరీక్షల కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చినప్పుడు రూ. 3వేలు, ప్రసవ సమయంలో బాబు జన్మిస్తే రూ. 2వేలు, పాప పుడితే రూ. 5వేలు ఇస్తారు. శిశువుకు మూడున్నర నెలల్లో టీకాలు వేస్తే రూ.2 వేలు, 9నెలల సమయంలో టీకాలు వస్తే రూ. 3వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. కానీ కొంత కాలంగా డబ్బులు జమ కావడంలేదు. నిధులు లేమీ కారణంగా అందడంలేదు. జిల్లాలో సుమారు రూ.12.14కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

కిట్‌తో సర్కారులో పెరిగిన ప్రసవాలు

ఈ పథకంతో మాతా శిశు సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. పథకం వచ్చిన తర్వాత సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. మాతాశిశు మరణాల సంఖ్య కూడా తగ్గింది. అంతే కాకుండా ప్రైవేట్ ఖర్చు భారం కూడా తగ్గుతున్నది. ప్రస్తుతం ప్రైవేట్ హాస్పిటళ్లకు పోతే అడ్డగోలు బిల్లులు వసూలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే.

300 మందికి పెండింగ్..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కిట్లు ఎప్పటికప్పుడు పంపిణీ చేసేవారు. ప్రసవం తర్వాత ఎప్పటికప్పుడు కంఠనుగా ఇచ్చేవారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఈ పథకానికి మంచి గుర్తింపు లభించింది. కానీ ప్రస్తుతం కిట్ల కొరత వేధిస్తున్నది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కిట్లు అందుబాటులో లేవు. గర్భిణుల నమోదు పెరుగుతున్నా మూడు నెలలుగా కిట్లు అందడంలేదు. ప్రభుత్వం నుంచి సరఫరా కావడంలేదని అధికారులు చెబుతున్నారు. సుమారు 300మందికి కిట్లు అందించాల్సి ఉంది. ప్రసవం అయిన వెంటనే కిట్లు ఇవ్వకపోవడంతో బాలింతలు, శిశువుల కోసం బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బిడ్డ పుట్టి మూడు రోజులైనా కిట్టు ఇయ్యలే

సంవత్సరం క్రితం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయిన రోజే బిడ్డ రక్షణ కోసం కేసీఆర్ కిట్టు అడుగక ముందే ఆసుపత్రి వాళ్లు ఇచ్చింద్రు. ఇప్పుడు అప్పటిలాగా లేదు. ఇప్పుడు ఇదే